కానీ- రెండోది ..... ఇట్స్ ఏ మాటర్ ఆఫ్ ప్రెస్టేజ్! ఆ బార్ నిండా మహతి నవ్వులే విన్పిస్తున్నాయి మధుకర్‌కి.

"ఈ సారి తన చేతిలోంచి మహతి ఎలా తప్పించుకుంటుందో చూస్తాను--" రెండో పెగ్గును అందుకుంటూ అనుకున్నాడు మధుకర్. అప్పటికి, అందరూ మూడో పెగ్గు ప్రారంభంలో ఉన్నారు. "చిన్న ఏ జోకు చెప్పరా" అని నిధిని రిక్వెస్ట్ చేశాడు సురేష్.

"అయితే చెప్తాను విను ..... ఓ బారువాళ్ళు ఓ పేపరులో యిలా ప్రకటించారు-

"Wanted Bar-Maid. Bust be attractive"

ఆ ట్విస్టుకి అందరూ నవ్వారు. మధుకర్‌తో సహా. మధుకర్ ఇప్పుడు ఫార్మ్‌లో కొచ్చాడు.

"ఒరేయ్ జోకుల పార్టీకి ఎండ్ చెప్పండి ..... మీరు నాకు కోపరేట్ చేస్తారా, లేదా ..... చెప్పండి" సీరియస్‌గా అడిగాడు మధుకర్.

"దేనికో చెప్పు ..... చేస్తాం" నిధి దయాళ్ అన్నాడు.

మూర్తి తప్ప మిగతా ఇద్దరూ షాక్ తిన్నారు ఆ మాటకి- కొద్ది క్షణాలక్కడ లోతయిన నిశ్శబ్దం పేరుకొంది.

"మహతిని రేప్ చేస్తావా?"

"ఎస్ ..... ఐవాంట్ టు రేప్ హెర్ ..... నా తడాఖా ఏమిటో చూపిస్తాను. లేకపోతే నన్ను ఫ్రూల్‌ని చేస్తుందా? మహతి పొగరుబోతుతనాన్ని అణిచేసి, ఎందుకూ పనికిరాకుండా చెయ్యకపోతే ..... నా పేరు మధుకర్ కాదు ..... "

అందరూ మధుకర్ ఫర్మ్ డెసిషన్‌కి ఉలిక్కిపడ్డారు.

“అవసరమైతే జైలుకైనా వెళతాను - మహతిని నేను రేప్ చేసినట్లు ..... అందరికీ తెల్సేటట్టు కూడా చేస్తాను. అందుకు మీ కోపరేషన్ గావాలి ..... ” శాసిస్తున్నట్లుగా ఉంది మధుకర్ కంఠం.

“ఒకే - మేం కోపరేట్ చేస్తాం. ఎక్కడ చేస్తావ్? ఎలా చేస్తావ్? ఆ అమ్మాయి వంటరిగా నీకెలా దొరుకుతుందనుకున్నావ్?” నిధి దయాళ్ అన్నాడు సంబరపడిపోతూ.

“మా ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్‌లో, మహతిని రేప్ చెయ్యాలి. నేను రేప్ చేసే ప్రయత్నాన్ని మాత్రమే మీరు ఫోటోలు తియ్యాలి.”

“ఆ అమ్మాయిని గెస్ట్ హౌస్‌కి తీసుకొచ్చే పూచీ నాది ..... ” మూర్తి అన్నాడు.

“మొన్న తెచ్చావ్ గదా. అలాగేనా ..... ” విసురుగా అన్నాడు మధుకర్.

“ఈసారి డన్ ..... ” చాలెంజ్‌గా అన్నాడు మూర్తి.

“గెస్ట్ హౌస్‌లో వూరికి చివర రేప్ ఏమిట్రా ..... నీ రేప్ హిస్టరీ క్రియేట్ చెయ్యాలంటే, యూనివర్శిటీ ఆడిటోరియంలో రేప్ చెయ్యి ..... కాలేజీ కాంపస్‌లో రేప్ చెయ్యి ..... నీ పేరు మారుమోగిపోతుంది. టిట్ ఫర్ టాట్ ..... నిన్ను ఫూల్‌ని చేసినందుకు అలా చేస్తేనే రివెంజ్ తీసుకున్నట్టు” అన్నాడు సురేష్.

“కాలేజీ కాంపస్‌లో, ఆడిటోరియంలో రేప్ చెయ్యడమంటే, డాన్స్ ప్రోగ్రాం ఇవ్వడమనుకున్నావా ..... మనం నలుగురమే అక్కడుంటామనుకున్నావా ..... ” జుత్తు పైకి ఎగదోసుకుంటూ అన్నాడు మధుకర్.

అదే సమయంలో బార్లోకి ప్రవేశించాడు విజయ్.

“హాయ్” అనుకుంటూ లోనికొచ్చి, అక్కడున్న గ్లాసుల్లో ఓ గ్లాసుని తీసుకొని గబగబా తాగేసి కిందపెట్టి--

“ఎన్నో రౌండ్ రా!” అని అడిగాడు అందరి ముఖాలవైపు చూస్తూ--

"ఎన్ని రౌండ్‌లైనా ఒకటేగానీ, ప్రస్తుతం హాట్ హాట్‌గా వుంది మూడ్ ..... డోంట్ డిస్టర్బ్ ..... ముందో మాట చెప్పెయ్. నీ గర్ల్ ఫ్రెండ్ కన్పించిందా లేదా?" అడిగాడు నిధి దయాళ్.

"ఏం కిస్‌లో ..... ఏం గోలో ..... ఒరేయ్ మధూ నీకో ఇన్‌ఫర్‌మేషన్ మహతి ఫాదరూ, మదరూ మహతికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నార్ట ..... ఏదో పెళ్ళి సంబంధం చూడ్డానికి రేపు వాళ్ళు బొంబాయి వెళ్తున్నార్ట ..... మా మేరీ చెప్పింది" చెప్పాడు విజయ్.

"కరెక్టుగా దొరికిందిరా. వయసొచ్చే కాలంలో, ఎక్కాల బుక్కే సెక్స్ బుక్కయినట్టు- ఏం న్యూస్ పట్టుకొచ్చావ్ రా ..... " పొగిడాడు మూర్తి.

ముందున్న గ్లాసులోంచి ద్రవాన్ని గబగబా తాగేసి- "నీ న్యూస్ నిజమేనా?" అని అడిగాడు.

"హండ్రెడ్ పర్సెంట్ నిజం రా మా గర్ల్‌ఫ్రెండ్ మీదొట్టు" విజయ్ అన్నాడు.

"అలాగైతే స్పాట్ మారింది. మా గెస్ట్ హౌస్ కాదు. మహతి బెడ్ రూమ్ ..... రేపు రాత్రే ముహూర్తం. రేపు రాత్రి సరిగ్గా పది గంటలకు".

"నీ శోభనానికి మేం కాపలా కాస్తాం. కానీ ..... మాకేమిస్తావురా?" నిధి దయాళ్ అడిగాడు. అందరూ నిధి వేపు అసహ్యంగా చూశారు.

"రేప్ చేసి నా కక్ష తిర్చుకున్నాక, వాటిని ఫోటోలు తీసి గోడల్నిండా అతికిస్తాను. మహతి వాటిని చూసి, వురేసుకుని చచ్చిపోవాలి."

కసిగా, కసికసిగా అనుకున్నాడు మధుకర్.

మరో అరగంట సేపు తర్వాత ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

* * * *

అంత ఇన్ హ్యూమన్‌గా తను ప్రవర్తించడం తప్పేమో!

కాదు ..... తప్పు కాదు.

ఇటీజ్ సెంట్ పర్సంట్ రైట్!

మధుకర్‌ని తను గాఢంగా ప్రేమిస్తోంది.

కానీ తండ్రి ఆస్తితో జల్సాలు చేసే మధుకర్‌ని కాదు. తండ్రి డబ్బుతో తందనాలాడే మధుకర్‌ని కాదు తండ్రి కష్టపడి సంపాదించిన డబ్బును, వృధాగా ఖర్చుపెట్టే బాధ్యత లేని మధుకర్‌ని కాదు, కానీ మధుకర్ తనకు కావాలి.

కానీ ఈ మధుకర్ కాదు- ఎవరో సంపాదించిన కోట్లకు తను అధిపతినని చెప్పుకొనే మధుకర్ కాదు.

కొత్త మధుకర్ - నడిరోడ్డుమీద పైసా జేబులో లేకుండా, కాళ్ళతో నడిచి, సామాన్యుడిలా వెళ్ళే మధుకర్ కావాలి. చెమటతో, తెలివి తేటలతో పైసాని సంపాదించే మధుకర్ కావాలి, పైకెదిగే మధుకర్ కావాలి.

అందుకే-

తను ద్వేషంలోంచి నరుక్కొస్తోంది. ద్వేషాన్ని క్రియేట్ చేస్తోంది.

ఎవరో కవి అన్నట్టు ప్రేమలోంచి ప్రేమ పుట్టదు ..... పుట్టినా ఆ ప్రేమ నిలవదు. ద్వేషం పెనుద్వేషం, విషంలాంటి ద్వేషంలోంచి పుట్టే ప్రేమ నిలుస్తుంది.

నిజమైన ప్రేమ ఆలోచన నివ్వాలి- విరహాన్ని కాదు- ఎదిగేలా ఉత్తేజపర్చాలి. నిజమైన ప్రియురాలు ప్రియుడికి, దారి తెలీని ప్రేయుడికి ముద్దుల్ని ఒక్కటే కాదు ఇవ్వాల్సింది- లక్ష్యాన్ని కూడా.

నువ్వు యుద్ధానికి వెళ్ళు, శత్రువుల్ని చీల్చి చెండాడు, విజయుడివై తిరిగిరా. నీ కోసం, నీకు స్వర్గ సుఖాలు అందించడంకోసం హంస తూలికా తల్పంమీద, విరహిణినై వుంటాను ..... ఆ ప్రాచీనకాలంలో ప్రియుడ్ని యుద్ధానికి పంపే రాజరికపు స్త్రీ ఆదర్శం- అందుకే గొప్పది.

లక్ష్యం ముందు చెప్పింది - విజయం తరువాతే సుఖం.

అదే ఈనాటి స్త్రీకి ఆదర్శం కావాలి.

స్త్రీ తలుచుకుంటే, మగవాడిని తీర్చిదిద్దగలదు. కానీ రాన్రానూ స్త్రీలు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారు. దానికి స్పష్టమైన ఉదాహరణ దేశంనిండా కిక్కిరిసిన జనాభా పెరుగుదల.

ఉద్యోగం లేకపోయినా, ఒక మగవాడిని ఒక స్త్రీ పెళ్ళాడుతుంది వాడికి ఏ లోటూ రాకుండా చూస్తుంది- అఫ్‌కోర్స్ పెళ్ళి భద్రతకోసం తప్పకపోవచ్చు.

కానీ- నువ్వు ఏదో ఒక పనిచేసి సంపాదించుకుని వస్తేనే ..... నీకు ఈ రాత్రి సుఖం అని కండిషన్ విధిస్తే, తగినపని దొరక్కపోయినా, తన భార్యను పోషించాల్సిన కనీస ధర్మాన్నయినా గుర్తించి కష్టపడతారు. ఆలోచనలేని అర్థధర్మాలు పట్టి వెనక్కి లాగుతున్నంతకాలం, భారత దేశంలో ఎన్ని ఇజాలు పుట్టినా స్త్రీ ఉనికి మాత్రం ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే వుంటుంది.

తను మధుకర్‌ని ప్రేమిస్తున్నది. అవసరమైతే అతన్ని తనవేపు తిప్పుకోవడంకోసం తనేమైనా చేస్తుంది. కానీ-

మధుకర్ తనని ద్వేషిస్తున్నాడా? ప్రేమిస్తున్నాడా? తను రెచ్చగొట్టే ప్రతిసారి, అతని కళ్ళల్లో ఆ రియాక్షన్‌ని తను గమనిస్తోంది.

ఆ రియాక్షన్ అతన్ని ఎటు డ్రైవ్ చేస్తోంది.

దూరంగా- పరుగెత్తుకొస్తున్న మేరీని చూసి, కారు స్లో చేసింది మహతి.

"ఏంటా పరుగు" కారు డోర్ తీస్తూ అంది మహతి.

"మహీ ..... మహీ ..... మరేమో" ఏదో చెప్పబోయింది మేరీ.

“ముందు కూర్చో తల్లి ..... కేంటిన్లో మాట్లాడుకోవచ్చులే ..... ” యాక్సిలేటర్ని నొక్కించి మహతి.

“అదికాదు ..... మహీ ..... ఇవాళ ..... మీ మదరూ ..... ఫాదరూ ..... వూరెళుతున్నారు కదా. ఏదో పిచ్చాపాటి మాట్లాడుతూ - మా బోయ్ ఫ్రెండ్ విజయ్‌తో అన్నానది. అతనేమో దాన్ని మధుకర్‌తో చెప్పినట్టున్నాడు. మధుకర్ నిన్ను ఇవాళ రాత్రి రేప్ చెయ్యడానికి ప్లాన్ వేశాడట.

భయం, భయంగా చెప్పింది మేరీ.

“నన్ను మధుకర్ రేప్ చేస్తాడా” తలతిప్పి, మేరీ కళ్ళవేపు చిలిపిగా చూస్తూ-

“చెయ్యనీ, రేప్ బాగోదా ..... పెళ్ళికి ముందే ఆ ఎక్స్‌పీరియన్స్ సూపర్బ్‌గా వుంటుందిట కదే ..... ” అంది మరింత నవ్వుతూ.

“అది కాదే ..... నేన్చెప్పింది ..... ”

“నువ్వు నాకు చెప్పాల్సింది చెప్పావ్‌కదా ..... థాంక్స్ ఏం చెయ్యాలో నాకు తెల్సు” కాంటిన్ ముందు కారాపుతూ అంది మహతి.

“మహీ! పోలీసులకు ఇన్ఫామ్‌చేసి, సెక్యూరిటీ ఏర్పాట్లు చేసుకోవే. లేకపోతే, ఇవాళ రాత్రి మేమందరం నీతోపాటే వుంటాం”

“ఏమఖ్కర్లేదు. ముందు కేంటిన్లోకి పద. ఐస్ క్రీం తిందాం.”

ఇద్దరూ కేంటిన్ కౌంటర్ దగ్గర నిలబడి ఐస్‌క్రీం తింటుంటే, సుధారాణి వచ్చింది-- ఆ సమయంలో లోనికొచ్చిన మధుకర్ మిత్రబృందాన్ని చూడగానే మేరీ, మహతివేపు చూసి-- “ మధుకర్ ” అని రహస్యంగా అంది.

మధుకర్‌ని అక్కడ అల్లరి పెట్టాలనిపించింది మహతికి.

ఒక ఐస్‌క్రీం తీసుకొని, అతని దగ్గరకెళ్ళింది.

"ఎప్పుడూ కోపంగా వుండేవాళ్ళు ఐస్‌క్రీం తింటే చల్లబడతారట. తీసుకో" అంటూ అతని చేతిలో పెట్టేసి వచ్చేసింది.

అందరూ గొల్లుమని నవ్వారు.

మధుకర్ రోషంగా ఐస్‌క్రీంని విసిరేసి, గబగబా మహతి దగ్గర కెళ్ళి-- "దిసీజ్ టూమచ్ మహతి-- నేనేం డాల్ ననుకున్నావా ..... ఆట్లాడ్డానికి" అరిచాడు.

"డాలే కాదు. డాల్ లేక్‌వి" ఆ అరుపును అనుకరిస్తూ తనూ అరిచింది మహతి.

హిపి ప్. హుర్రే ..... హిపి ప్ ..... హుర్రే .....

అసలే కేంటిన్, అందులోనూ వాళ్ళిద్దరి గురించి తెల్సిన స్టూడెంట్స్.

"నువ్వు బతుకంతా ఏడ్చుకునేటట్టు చెయ్యకపోతే నా పేరు మధుకర్ కాదు" అన్నాడు కోపంగా.

"రోజూ కళ్ళకు రాసుకోమను అమృతాంజనాలిస్తావా ఏడుపు వస్తుంది" మళ్ళీ హెకిల్ చేసింది మహతి.

ఆ జోక్కి మళ్ళీ నవ్వులు.

అందరూ తననే వేళాకోళం చేస్తున్నట్టు అనిపించడంతో విసురుగా బయటికొచ్చేసాడు మధుకర్.

బయట కారు దగ్గరకిచ్చి-

ఆ రోజు రాత్రి ఎవరు, ఏ పనులు చెయ్యాలో, డ్యూటీ వేశాడు మధుకర్.

"ఒరేయ్ మూర్తీ ..... సాయంత్రం ఆరు గంటలనుంచీ ఆ ఇంటిని కనిపెట్టుకుని వుండు. ఇంట్లో ఎంతమందున్నారు, వాళ్ళెక్కడ పడుకుంటారో నాకు ఇన్‌ఫర్మేషన్ కావాలి."

"ఒరేయ్ ..... దయాళ్ ..... నువ్వూ, విజయ్, సురేష్ ముగ్గురూ ఆ బిల్డింగ్ని మిగతా మూడు వేపులా కాపలాకాయండి. ఆ టైమ్లో ఎవరొచ్చినా అవసరమైతే షూట్ చేసేయండి. తర్వాత నేను చూసుకుంటాను. ఎందుకయినా మంచిది నా దగ్గర పిస్టల్ వుంది. ఇస్తాను ఓ.కే. సాయంత్రం ఆరుకి బారు కొచ్చేయండి?" చెప్పేసి వెళ్ళిపోయాడు మధుకర్.

"డ్రింక్ నిషాలో రాత్రేదో వాగాడనుకున్నాను. ఇది నిజమైతే గొడవలైపోతాయేమో. వాడు బాగానే వుంటాడు, పోలీసులు మనని వాయించేస్తారేమోరా" పిరికిగా అన్నాడు సురేష్.

"ఇప్పుడు నువ్వు రానన్నావనుకో అసలే పిచ్చోడు. ఆ పిస్టలేదో వుందన్నాడుగా ..... ముందు నిన్ను కాల్చేస్తాడు. ఎలాగూ ఒప్పుకున్నాం. వాడిని జాగ్రత్తగా మేడమీదకు పంపేసి మనం వచ్చేద్దాం. స్పాట్లో మనం వుండం కాబట్టి, పోలీసుల వరకూ కేసువెళ్ళినా కొంపలుమునగవు" సలహా యిచ్చాడు నిధి దయాళ్.

*　　　　*　　　　*　　　　*

బంజారా హిల్స్--

రోడ్ నెం 25 లో ఒక కార్నర్లో వుంది -- ఆ పింక్ బిల్డింగ్. రెండంతస్తుల బిల్డింగ్ అది. పొడవైన కాంపౌండ్ వాల్. పెద్ద గేటు, గేటు దాటగానే గార్డెన్. పోర్టికో- మెయిన్డోర్ తీసుకుని లోపలకెళితే, పెద్ద హాలు, హాలుకి ఎడం పక్కన వుడెన్స్టెప్స్. కింద కిచెన్ రూం, డైనింగ్ హాల్, గెస్ట్ రూమ్, లైబ్రరీరూమ్, విజిటర్ రూమ్ వున్నాయి. పైన బెడ్ రూంలో కుడిప్రక్క చివర మహతి బెడ్ రూమ్ వుంది.

సర్వెంట్ రూమ్ వెనక ఎడం ప్రక్కన వున్నాయి. రాత్రివేళల్లో గూర్ఖా, జెర్మన్ షెపర్డ్ కుక్క - ఆ బిల్డింగ్కి కాపలా.

మధుకర్ వేసిన డ్యూటీ ప్రకారం సరిగ్గా ఆరుంపావుకి ఆ బిల్డింగ్కి ఎదురుగా వున్న పార్కులో కూర్చున్నాడు మూర్తి.

ఆ బిల్డింగ్లోకి ఎవరెవరు వెళుతున్నారో, ఎవరెవరు వస్తున్నారో గమనిస్తున్నాడు. ఏడు గంటలకు బయటనుంచి ఇంటికొచ్చింది మహతి. వంట మనిషి రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో బయట కెళ్ళిపోయింది. తొమ్మిది గంటలకు ఆ

ఇంటిలో ఒక్కొక్క లైటూ ఆఫ్ అవ్వటం మొదలైంది. మెయిన్ గేటు దగ్గర, పోర్టికో దగ్గర రెండు నైట్ బల్బులు వెలుగుతున్నాయి.

సరిగ్గా తొమ్మిదిన్నరకు--

నెమ్మదిగా ఆ సందులోకొచ్చింది మారుతీ 1000 కారు. ఆ కారులో మధుకర్, విజయ్, సురేష్, నిధిదయాళ్ వున్నారు. వీధిలో ఎక్కడా ఒక్క మనిషి కూడా లేడు. నిర్మానుష్యంగా వుంది. రోడ్డుకి అటూ ఇటూ ఓ నాలుగు కార్పొరేషన్ దీపాలు వెలగలేక వెలుగుతున్నాయి.

"మీరు దిగండి. దిగి ఆ బల్బుల్ని పగులకొట్టేయండి."

ముందు జాగ్రత్త చర్యగా చెప్పాడు మధుకర్.

"ఓ. కే." ముగ్గురూ దిగి, రాళ్ళు తీసుకొని ఆ బల్బుల్ని సూటిగా కొట్టారు.

టప్ ..... టప్ ..... టప్ ..... టప్ .....

అంతవరకూ వెలుగులో వున్న ఆ వీధి కారు చీకటిలోకి కూరుకుపోయింది.

కారుని తీసుకొచ్చి--

పార్కు పక్కగా ఆపాడు మధుకర్. కారుని చూడగానే మూర్తి కారు దగ్గరకొచ్చాడు.

"ఈ ఏరియాలో పోలీస్ పెట్రోలింగ్ ఎక్కువగా వున్నట్టుంది. ఇప్పటికే రెండు సార్లు పోలీస్ జీప్ వెళ్ళింది" చెప్పాడు మూర్తి ఒకింత నెర్వెస్‌గా.

"నేను లోనకెళ్ళాక ఎవడయినావస్తే, లోన పార్టీ జరుగుతోంది. ఫ్రెండ్ కోసం వెయిట్ చేస్తున్నామని చెప్పండి. తర్వాత నేను చూసుకుంటాను" చెప్పాడు మధుకర్.

అక్కడ ఆరుగంటల నుంచి తను చూసిన విషయాలన్నీ చెప్పాడు మూర్తి.

అప్పటికి టైమ్ 9-50 నిముషాలైంది. మూర్తి చీకట్లో కారుకి అనుకుని నిలబడగా, మిగతా ముగ్గురు ఆ బిల్డింగ్‌కి మూడువేపులా వెళ్ళారు. మెయిన్‌గేటుకి ప్రక్కనే వున్న చిన్న గదిలో నిద్రపోతున్నాడు గూర్ఖా.  తనతో తెచ్చుకున్న బైనాక్యులర్‌లోంచి, ఆ బిల్డింగ్‌ని మరోసారి పరీక్షించి, దాన్ని మూర్తికిచ్చి. ఆ బిల్డింగ్ వెనక్కి నడిచాడు. మూర్తి బైనాక్యులర్ లోంచి చూసాడు. మహతి బెడ్‌రూంలో మాత్రమే లైట్ వెలుగుతోంది.

ఆ సమయంలో మహతి బాత్‌రూం టబ్‌లో వుంది. గోరు వెచ్చని నీళ్ళలో మహతి కేరింతలు కొడుతోంది. మెల్లగా స్టీరియోలోంచి విన్పిస్తున్న మైకేల్ జాక్సన్ మత్తయిన ఆడగొంతు , టవల్ అందుకుని వళ్ళంతా అద్దుకొని, పొడి టవల్ని వంటికి చుట్టుకుని బాత్‌రూంలోంచి లివింగ్‌రూంలో కొచ్చింది.

*            *            *            *